దాళ్వా సాగుకు సన్నద్ధం



మొగల్తూరులో వేసిన ఆకుమడి



మొగల్తూరులో విత్తనాలు వేసేందుకు సిద్ధం చేస్తున్న చేను

- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- ముమ్మరంగా సార్వా మాసూళ్లు

మొగల్తూరు: సార్వా మాసూళ్లు ఇంకా పూర్తి కాక మునుపే రైతులు దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. మార్చి ఆఖరుకు పంట చేతికొచ్చే విధంగా సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తుండటంతో సాగు పనులు మొదలు పెట్టారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి నాట్లు పూర్తి కావడంతో పాటు వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో సార్వా మాసూళ్లు పూర్తి కావాలంటే మరో ఇరవై రోజులు పడుతుంది. అయితే అధికారులు ముందస్తు దాళ్వా పనులు చేపట్టాలని సూచిస్తుండటంతో ముందుగా నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

పూర్తికాని సార్వా మాసూళ్లు

ఈ ఏడాది సార్వా సాగు కేవలం 640 ఎకరాల్లో మాత్రమే చేపట్టారు. సాగు ఆరంభం నుంచి వర్షాలు కురవడంతో నాట్లు వేసుకోవడం ఆలస్యమైంది. రెండు మూడు సార్లు వేసుకున్న నాట్లు మునిగిపోవడంతో సాగు చేపట్టేందుకు మక్కువ చూపలేదు. దీంతో 640 ఎకరాలకు మాత్రమే పరిమితమైనా ప్రస్తుతం 165 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తి చేసుకుని ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. ఈ నెలలో రెండు సార్లు తుఫాన్లు ఏర్పడటంతో చేను కోతకు వచ్చినా కోసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో కోతలు వాయిదా వేసుకుంటున్నారు. వాతావరణం అనుకూలిస్తే డిసెంబర్ ఆఖరు నాటికి కోతలు పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

1984 ఎకరాల్లో సాగు

మండలంలోని మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం, రామన్నపాలెం, గ్రామాల్లో సుమారు 1984 ఎకరాల్లో సాగు చేపట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సార్వాకు పంట చేపట్టని రైతులు దాళ్వా సాగు కూడా చేపట్టకపోతే వ్యవసాయ భూములు చౌడు భూములుగా మారుతాయనే ఉద్దేశ్యంతో రామన్నపాలెం పంచాయతీ అడవిపత్ర ప్రాంత రైతులు కూడా దాళ్వా సాగు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

20 ఎకరాల్లోనే ఆకుమడులు పూర్తి

సార్వా సాగుకు సంబంధించి 1984 ఎకరాలకు గాను 99.21 ఎకరాల్లో ఆకుమడులు వేయాల్సి ఉండగా ప్రస్తుతానికి 20ఎకరాల్లో మాత్రమే ఆకుమడులు వేశారని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. రాబోయే సంక్రాంతి పండుగ నాటికి ఆకుమడులు పూర్తవుతాయని, విత్తనాలుకూడా ప్రైవేట్ దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

స్వల్పకాల వ్యవధి విత్తనాలు మేలు

దాళ్వా సాగుకు సంబంధించి స్వల్ప కాలిక రకాలైన ఎంటీయూ 1121,ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 రకం విత్తనాలు వినియోగిస్తే 120 నుంచి 140 రోజులకు పంట చేతికొచ్చే అవకాశం ఉంటుంది.

సాగుకు సమాయత్తమౌతున్నాం



సార్వా పంట మాసూళ్లు ఆలస్యమవడంతో సాగు చేపట్టని చేలల్లో దాళ్వా సాగు చేపట్టేందుకు సమాయత్తమవుతున్నాం. అయితే సార్వా చేలు కోతకు వచ్చినా వాతావరణం అనుకూలించకపోవడంతో కోతలు వాయిదా వేశాం.

– గూడూరి మావుళ్లు, నవుడూరుగరువు

రైతులకు వివరిస్తున్నాం



ముందస్తు దాళ్వా సాగు చేపట్టమని రైతులకు వివరిస్తున్నాం. సార్వా చేపట్టకపోవడంతో ఖాళీగా ఉన్న చేలల్లో దుక్కులు దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించమని రైతులను కోరుతున్నాం. 120 నుంచి 140 రోజులకు చేతికొచ్చే 1121, 1156, 1153 రకం విత్తనాలు సాగుకు అనుకూలంగా ఉంటాయి.

– అబ్దుల్ రహీమ్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

కౌశల్ ప్రతిభా పోటీలకు శేరేపాలెం విద్యార్థిని ఎంపిక



ముమ్మినేడి శ్రీదేవి లక్ష్మీసౌజన్య

మొగల్తూరు: కౌశల్ ప్రతిభా పోటీ పరీక్షలకు శేరేపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముమ్మినేడి శ్రీదేవి లక్ష్మీసౌజన్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఇబ్రహీమ్ మంగళవారం తెలిపారు. మండల, జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైందని, లక్ష్మీసౌజన్య ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ఎస్ ఉత్తీర్ణత సాధించి స్కాలర్ షిప్ అందుకుంటుందన్నారు. ఈ సందర్భంగా సౌజన్యను విద్యా కమిటీ చైర్మన్ దివి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సమన్వయ అధికారి సూర్యనారాయణ

పెనుగొండ: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ పి.సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పెనుగొండలోని సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పెనుగొండ సీహెచ్‌సీలో రోగులకు ఇబ్బంది లేకుండా త్వరలోనే ఫిజియోథెరపిస్టును ఏర్పాటు చేస్తామన్నారు. సీహెచ్‌సీల్లో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఆరోగ్య కేంద్ర ఆవరణలో రహదారి నిర్మాణం, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైద్యాధికారి పీఎస్‌వీ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు దుప్పట్ల పంపిణీ



ప్రభుత్వ ఆసుపత్రిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు బెడ్ షీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ సీఐ కె.రజనీకుమార్ మాట్లాడుతూ సేవ చేయడం కూడా అదృష్టంగానే భావించాలన్నారు. ఇటువంటి క్లబ్‌ల ద్వారా ఎంతో మంది పేదవారికి సహాయ సహకారాలు అందడం అభినందనీయమని అన్నారు. అలాగే యునైటెడ్ వనిత కాపు క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పాఠశాల నందు విద్యార్థులకు కాంపిటీషన్స్ నిర్వహించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్షుడు జక్కంపూడి మధన్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, మంగెన అరుణ, వసంతలక్ష్మి, ఉషారాణి , యామన విజయలక్ష్మి, శిరిగినీడి నాగార్జున, పోకల రాము, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో జాబ్‌మేళా

పాలకొల్లు సెంట్రల్ : స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్, టాప్ కమర్షియల్ బ్యాంక్, ఎఫ్ఎస్ఐటీ సొల్యూషన్స్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే విద్యార్థులు ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అయ్యి, 27 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో 9849712739, 9912046234లలో సంప్రదించాలన్నారు.

రంగస్థల నటి రమణకు సకల కళా ప్రవీణ బిరుదు



రంగస్థల నటి రమణను సత్కరిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కమిటీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: రంగస్థలంపై బాలనటిగా అడుగు పెట్టి వందలాది ప్రదర్శనలిచ్చిన నటి రమణ అభినందనీయురాలని పలువురు వక్తలు ప్రశంసించారు. మండలంలో పెదమామిడిపల్లిలో వేంచేసియున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర యువసేన 10వ వార్షికోత్సవం సందర్భంగా తణుకుకి చెందిన రంగస్థల నటి మహంతి రమణను సకల కళా ప్రవీణ బిరుదుతో సత్కరించారు.

హెచ్‌ఎం భవానీప్రసాద్‌కు సేవా పురస్కారం

పాలకొల్లు సెంట్రల్: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కాకినాడ వారి ఆధ్వర్యంలో అందించిన సేవా పురస్కారం పట్టణానికి చెందిన జీపీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ అందుకున్నారు. మంగళవారం కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ బొడ్డపాటి దాసు భవానీప్రసాద్‌ను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు.

క్రమశిక్షణ కలిగిన విద్య అవసరం



కళాశాలలో జ్యోతి వెలిగిస్తున్న డీఎస్పీ శ్రీవేద

పాలకొల్లు సెంట్రల్: క్రమశిక్షణ కలిగిన విద్య ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి దోహదపడుతుందని నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద అన్నారు. మంగళవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో (డీఎన్నార్) ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వేద మాట్లాడుతూ తాను నిండు గర్భిణిగా ఉండి గ్రూప్–1 పరీక్ష రాసయ్యానన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే విజయం సాధించగలిగానన్నారు. తాను డెంటల్ వైద్యురాలినని అలాగే కూచిపూడి, భరతనాట్యంలోనూ ప్రావీణ్యత ఉందన్నారు. అంటే మనకి ఏదైనా సాధించాలనే సంకల్పం ఉంటే ఎందులోనైనా విజయం సాధించగలమన్నారు. ముందుగా విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, రాజోలు, నారాయణపురం, పాలకొల్లు కోకోనట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ సాయిబాబు, డాక్టర్ నిర్మల, సీపీడీసీ సభ్యులు బారిష్టర్, నారాయణరావు, శేషగిరిరావు, మైథిలి, తదితరులు పాల్గొన్నారు.

విచారణ నివేదికను అధికారులకు సమర్పిస్తాం



అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.వెంకటేశ్వరరావు

మొగల్తూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిర్వహిస్తున్న విచారణ నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు సమర్పిస్తామని నరసాపురం సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మొగల్తూరు సహకార సంఘంలో 51వ విచారణకు వచ్చిన ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. 1964 సహకార సంఘ చట్టం ప్రకారం 51వ విచారణ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 1800 మంది సంఘ సభ్యులకు నోటీసులు జారీ చేశామని, వారి విచారణ అనంతరం నాటి సంఘ డైరెక్టర్లను విచారిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రికార్డుల ప్రకారం కుటుంబ రుణాలు రూ.10 లక్షల 35 వేలు, దస్తావేజులు లేకుండా టెన్‌వన్ అడంగల్ ద్వారా రూ.10 లక్షల 11 వేల రుణాలు తీసుకున్నట్టుగా గుర్తించామన్నారు. అంతే కాకుండా ఆన్‌లైన్‌లో పేర్లు లేకుండా రూ.14 లక్షల 32 వేలు, ఫిష్ ఫీడ్‌కు మంజూరు చేసిన రూ.1,32,40,795 రుణాలకు సంబంధించి సరైన ఆధారాలు లేవన్నారు. సంఘం సొంత నిధుల నుంచి రూ.31,96,825 నిబంధనలకు విరుద్ధంగా రుణాలు పొందారని సంఘ సభ్యుల నుంచి వసూలు చేయాల్సిన మొత్తం కంటే తక్కువ వసూలు చేసినట్టుగా విచారణలో తేలిందని ఈ నివేదికను త్వరలో అధికారులకు అందిస్తామన్నారు.

48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ



రైతుసేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సయ్యద్ ఫాజిల్

పాలకొల్లు అర్బన్: ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని పోడూరు తహసీల్దార్ సయ్యద్ ఫాజిల్ అన్నారు. మట్టపర్రు గ్రామంలో రైతుల ధాన్యం కళ్లాలను మంగళవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం విక్రయాల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ పెనుమదం గ్రామంలో కుమార్ రైస్‌మిల్లును సందర్శించారు. అలాగే అంజలి మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడున్న మానసిక వికలాంగ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. ఆర్ఐ కందుల రాంబాబు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

డ్రెయిన్‌ను నిర్మించాలి

నరసాపురం: పట్టణంలో రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. మురుగు పారకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌ను పునఃనిర్మించాల్సిన అవసరముంది. అయితే మున్సిపల్ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. స్థానిక రాజరాజేశ్వరి థియేటర్ వద్ద నుంచి ఈ డ్రెయిన్‌ను ఆనుకుని పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్లకు సంబంధించిన వాడకపు నీరు ఈ డ్రెయిన్ గుండానే వెళ్లాలి. ప్రస్తుతం డ్రెయిన్ శిథిలమవడంతో మురుగు సక్రమంగా పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు



విద్యుద్దీపాలతో అలరిస్తున్న లూథరన్ చర్చి

పాలకొల్లు అర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణ, మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాలు విద్యుద్దీపాలతో ముస్తామవుతున్నాయి. చర్చిల ముందు ఏసు ప్రభువు జనన సూచికను తెలియజేస్తూ పశువుల పాకలు విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే అందంగా క్రిస్మస్ చెట్లు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని క్రీస్తు లూథరన్ చర్చి, మండలంలోని కొత్తపేట లూథరన్ చర్చిలు విద్యుద్దీపాలతో అలంకరించారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మున్సిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్. మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో నిర్వహిస్తారు. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం గుండానే వెళ్లాలి. ముఖ్యంగా పలు కళాశాలల విద్యార్థులు నిత్యం ఈ మార్గం గుండానే ప్రయాణిస్తారు. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న తమిళనాడు వాసి

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోని నిత్యాన్నదాన నిర్వహణకు తమిళనాడు పెరంబూర్‌కు చెందిన వాసవీ జ్యూయలర్స్ అధినేత రవిచంద్రన్ రూ.25 వేల విరాళాన్ని అందించారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించి వాసవీ కన్యకపరమేశ్వరి, నగరేశ్వరస్వామి, మహిషాసురమర్దనీ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

పెనుమంట్ర: కల్లాల్లో ధాన్యాన్ని గుర్తించి రైతుసేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా కొనుగోలు చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన పెనుమంట్ర మండలంలో రైతుసేవా కేంద్రం-2 పరిధిలో పర్యటించారు. పెనుమంట్ర, వెలగలవారిపాలెం గ్రామాల రైతులతో మాట్లాడారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, కాటాలో తూకం వేస్తున్న వడ్ల బస్తాలను పరిశీలించారు. మండలంలో ఎంత ప్రొక్యూర్‌మెంట్ జరిగింది. ఇంకా ఎంత జరగాల్సి ఉంది అని సంబంధిత అధికారులను అడిగారు. 24 వేల 462 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 14 వేల 106 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 2500 మెట్రిక్ టన్నుల ధాన్యం గుర్తించామని, వెంటనే రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలిస్తామని తహసీల్దార్ రవి కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.జ్యోత్స్న జేసీకి వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వాతావరణం అనుకూలించనందున రైతులతో మాట్లాడి వెంటనే రైస్ మిల్లులకు ధాన్యం తరలించాలన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలని జేసీ తెలిపారు.

ధాన్యాన్ని త్వరగా విక్రయించుకోవాలి



ధాన్యం పట్టుబడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పెనుగొండ: వాతావరణం అనుకూలంగా లేనందున రైతులు త్వరితగతిన ధాన్యాన్ని విక్రయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం పెనుగొండలో రైతుసేవా కేంద్రాలను సందర్శించారు. అనంతరం కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులతో ముచ్చటించారు. తేమ శాతం తగ్గడానికి, త్వరగా విక్రయించుకోవడానికి తీసుకోవలసిన చర్యలను సూచించారు.

రైసు మిల్లుల పరిశీలన

జిల్లా పౌర సరఫరాల మేనేజరు టి.శివరామప్రసాద్ పెనుగొండ మండలంలోని రైసు మిల్లులను, రైతుసేవా కేంద్రాలను పరిశీలించారు. ధాన్యాన్ని వాహనాల నుంచి దిగుమతి చేయడంలో ఆలస్యం చేయవద్దని సూచించారు. ఎప్పటికపుడు పూర్తి చేసి, రైతులకు అవసరమైన సంచులను సకాలంలో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.స్పందన పాల్గొన్నారు.

అధ్యాపకులచే పాఠశాల విద్యార్థులకు బోధన



పాఠశాల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు అర్బన్: పాఠశాల స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి అధ్యాపకులతో పాఠ్యాంశాలు బోధించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి చెప్పారు. పట్టణంలోని శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల ఔట్రీచ్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను అధ్యాపక సిబ్బందితో సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2027 వరకు కళాశాల అధ్యాపకులతో పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తామని ప్రిన్సిపాల్ వివరించారు. హెచ్‌ఎం జీటీవీ కుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి నూతన నామకరణం





ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి (ఇన్‌సెట్‌లో) దాత (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నూతనంగా నామకరణం చేశారు. ఇప్పటి వరకూ ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని యిమ్మిడి సత్యనారాయణ ఏరియా ఆసుపత్రిగా నామకరణం చేస్తూ మంగళవారం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జీవో నెం.745 జారీ చేశారు. ఆసుపత్రి నిర్మాణానికి 1966లో 14.5 ఎకరాల భూమిని దాత యిమ్మిడి కోటయ్య కుమారుడు సత్యనారాయణ విరాళంగా అందజేశారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆసుపత్రి పేరును తమ తాతగారి పేరు మీద నామకరణం చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులను కోరినట్లు సత్యనారాయణ కుటుంబ సభ్యులు తెలిపారు.

పరోపకారమే సనాతన ధర్మం



శివదేవుని చిక్కాలలో శ్రీమాతా పీఠాధీశ్వరి

పాలకొల్లు అర్బన్: ప్రతి ఒక్కరూ దేవతారాధన, పరోపకారం చేయడమే సనాతన ధర్మమని శ్రీమాతా పీఠాధీశ్వరి మాత శ్రీచందన అమృతా నందవల్లి (మాతా యోగేశ్వరి) అన్నారు. ప్రముఖ వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీపార్వతీ సమేత శ్రీశివదేవ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీలలితా సహస్రనామ కోటి కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాతాజీ పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ముందుగా మాతాజీకి పూర్ణకుంభంతో ఆలయ అర్చకస్వాములు, గ్రామ పెద్దలు, మహిళలు స్వాగతం పలికారు. శివదేవస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో కోటి శ్రీలలితా సహస్రనామార్చన మండల దీక్షగా చేపట్టారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి దీపోత్సవం

పాలకొల్లు అర్బన్: మండలంలోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. దొంగ ధనరాజు–గంగోత్రి దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి చేబ్రోలు బాలకృష్ణ గాంధీ బ్రహ్మత్వంలో బొల్లాప్రగడ వెంకటరత్నం–వాసంతి, బొల్లాప్రగడ సుబ్రహ్మణ్యం దంపతులచే స్వామి వారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు.

14న జాతీయ లోక్‌అదాలత్



జడ్జి జియావుద్దీన్

పాలకొల్లు సెంట్రల్: ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జియావుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన కోర్టు ఆవరణలో మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు డబ్బుతోపాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. సివిల్ కేసులు రాజీ చేసుకుంటే అప్పటికే కక్షిదారులు కట్టిన కోర్టు ఫీజును వెనక్కు ఇస్తారన్నారు. ప్రో నోట్ కేసులు, చెక్కుబౌన్స్ కేసులు, 498 (ఏ) కేసులు, కొట్లాట కేసులు, కుటుంబ తగాదాలు ఇలా రాజీకి ఆమోదయోగ్యమయ్యే అన్ని కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులకు లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించి రాజీకి కృషి చేయాలన్నారు.

ఆదమరిస్తే.. డ్రెయిన్‌లోనే

నరసాపురం: స్థానిక బస్టాండ్ వద్ద డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు లేవు. నిత్యం వేలాది మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. అలాంటి ఈమార్గంలో పరిస్థితి ఇంతప్రమాదకరంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకవడం లేదు. ఇటీవల బస్టాండ్ పక్కనున్న డ్రెయిన్‌ను బాగు చేసి, మూతలుతీశారు. పని పూర్తయినా తిరిగి మూతలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు.